కొవ్వొత్తుల ర్యాలీ



సాక్షి, సిటీబ్యూరో: పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ ఆదివారం మెహిదీపట్నం డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గుడిమల్కాపూర్ చౌరస్తా నుంచి మెహిదీపట్నం చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌తో కఠినంగా వ్యవహరించాలని డివిజన్ అధ్యక్షుడు చింతల రాజేష్ డిమాండ్ చేశారు.

వరి పరిశోధన కేంద్రం వార్షిక సమావేశం

ఏజీవర్సిటీ: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్(ఐసీఏఆర్) ఇండియాన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐఐఆర్ఆర్) వరి పరిశోధన, వరిపై ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ వార్షిక సమావేశం ఆదివారం రాజేంద్రనగర్‌లో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమాన్ని ఐసీఏఆర్ డీజీ పరోడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య మాట్లాడుతూ తెలంగాణలో వరి పరిశోధన 1928లో నిజాం పాలనలోనే ప్రారంభమైందని, హిమాయత్‌సాగర్ డ్యామ్ నిర్మాణంతో రైతులు వరి సాగు చేపట్టినట్లు తెలిపారు. నేడు తెలంగాణ దేశంలోనే మిగులు బియ్యం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా ఉందన్నారు.ఐసీఏఆర్ డీటీ డీకే యాదవ్ మాట్లాడుతూ 1996 విత్తన చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి దేశంలో 1500 వరి రకాలను విడుదల చేసినట్లు తెలిపారు.

కంప్యూటర్ శిక్షణ అవసరం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ శిక్షణ అవసరమని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 30 ప్రతి ఆదివారం నిర్వహించనున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరానికి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరికీ కనీస సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. ఈ నేపథ్యంలోనే ఉచిత శిక్షణా శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిక్షణలో బేసిక్ కంప్యూటర్ అవగాహన, టైపింగ్, రైటింగ్ స్కిల్స్, సీ లాంగ్వేజ్ తదితర అంశాలను నేర్పించనున్నామన్నారు. ప్రాక్టికల్ శిక్షణతో పాటు ప్రతి శిక్షణార్థులకు తగిన మార్గదర్శకత్వం అందిస్తామన్నారు. అవసరమైన వారు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్, మానవ సేవే మాధవ సేవా డైరెక్టర్ హేమలత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి

ఏజీవర్సిటీ: విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజిరెడ్డి అన్నారు. అయోధ్యలో మే 2 నుంచి 5 వరకు 22వ అఖిల భారత అంతర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ఉద్యాన విశ్వవిద్యాలయం తరఫున 40 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. క్రీడాకారుల బృందం బస్సును వీసీ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజు కొద్ది సమయాన్ని క్రీడలకు కేటాయించాలని, క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చీనా నాయక్, రిజిస్ట్రార్ భగవాన్, ప్రశాంత్, పిడగం సైదయ్య, వెంకటలక్ష్మి, విద్యార్థులు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంచే డిజైన్‌తాన్



కోర్సువిటాలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గచ్చిబౌలి: ఐటీ రంగంలో నైపుణ్యాన్ని పెంచి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే 'డిజైన్‌తాన్'లో అనేక మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం కొత్తగూడలో కోర్సువిటా ఆధ్వర్యంలో డిజైన్‌తాన్–2025 నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలలో మొదటిసారి నిర్వహించిన ఈ డిజైన్‌తాన్‌లో యుఐ, యుఎక్స్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్స్, వీడియో ఎడిటర్స్, సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్ ప్రతిభ చాటారు. కోర్సువిటా వ్యవస్థాపకులు అర్జున్ వినయ్ మాట్లాడుతూ పోర్ట్‌ఫోలియో బిల్డర్, జాబ్ సిమ్యులేషన్, క్విజ్‌విటా లాంటి సరికొత్త టెక్నాలజీలను ఆవిష్కరించామని తెలిపారు. డిజైన్ రంగంలో సృజనాత్మకత చాటుకునేందుకు విద్యార్థులకు డిజైన్‌తాన్ దోహదం చేస్తుందన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

సుందరీకరణ పనులు పూర్తయ్యేదెన్నడో?

- రూ.30 కోట్ల నిధులతో ప్రారంభమైన సర్దార్ మహల్ భవనం పనులు
- ప్రభుత్వం మారడంతో నిలిచిపోయిన వైనం
- ఆర్ట్ గ్యాలరీతో పాటు హెరిటేజ్ హోటళ్ల ఏర్పాటు
- ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దనున్న 'కుడా'



పనులు ప్రారంభానికి ముందు సర్దార్ మహల్ భవనం



నిలిచిపోయిన సుందరీకరణ పనులు

చార్మినార్: ఏడాదిన్నరగా సర్దార్ మహల్ భవన సుందరీకరణ పనులు నిలిచిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులు..ప్రభుత్వం మారిన వెంటనే నిలిచిపోయాయి. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను నిలిపివేసినట్లు తెలుస్తోంది. చార్మినార్ కట్టడానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ హెరిటేజ్ భవనానికి జరుగుతున్న సుందరీకరణ పనుల అనంతరం ఇక్కడ ఆర్ట్ గ్యాలరీతో పాటు హెరిటేజ్ హోటల్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఈ భవనానికి మరమ్మతులు ప్రారంభమయ్యాయి. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ తన సతీమణి అయిన సర్దార్ బేగం ప్రేమకు గుర్తుగా ఈ భవనం నిర్మించారు. ఆమెకు కానుకగా ఇవ్వడానికి నిర్మించినప్పటికీ..అప్పట్లో ఆమె దీనిని నివాస భవనంగా తీసుకోవడానికి నిరాకరించింది. నిజాం కాలం అంతరించిన అనంతరం ఈ భవనాన్ని భారత ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకోవడంతో 2018 వరకు ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పర్యవేక్షణలో 'కుడా'ఈ పనులను మొదలెట్టింది. ఏడాది పాటు చకాచకా జరిగినప్పటికీ..కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పనుల్లో జాప్యం జరుగుతోంది.

ఇండో–యూరోపియన్ నిర్మాణ శైలీలో..

ఇండో–యూరోపియన్ నిర్మాణ శైలీలో నిర్మించిన ఈ భవనాన్ని రాజస్థాన్‌లోని నీమ్ రానా ఫోర్టు ప్యాలెస్‌గా తీర్చిదిద్దనున్నారు. హెరిటేజ్ కట్టడాల పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా సర్దార్ మహల్ భవనానికి మరమ్మతులు వేగంగా మొదలయ్యాయి. రూ.30 కోట్ల నిధులతో కులీకుతుబ్ షా నగరాభివృద్ధి సంస్థ(కుడా)కు జీహెచ్ఎంసీ ఈ సుందరీకరణ పనుల బాధ్యతలను అప్పగించింది. పూర్వ వైభవం దెబ్బతినకుండా ఎంతో జాగ్రత్తగా ఈ పనులు చేయాల్సి ఉంటుందని..హడావుడిగా చేసే పనులు కావంటున్నారు. ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి.

1969 నుంచి కొనసాగిన బల్దియా కార్యాలయాలు..

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చార్మినార్ సమీపంలోని సర్దార్ మహల్ భవనంలో 1969 సంవత్సరం నుంచి బల్దియా కార్యాలయాలు కొనసాగాయి. ఈ భవనంలో బల్దియా కార్యాలయాలకు ముందు 1967–68 కాలంలో ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి విభాగం దాదాపు రెండేళ్ల పాటు కొనసాగింది. అనంతరం బల్దియా కార్యాలయాలు పనిచేశాయి. జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయంగా కొనసాగిన సర్దార్ మహల్ భవనంలో సర్కిల్–6, 7, 8, 9, 10 డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలతో పాటు ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటరీ, యూసీడీ కార్యాలయం, జనన, మరణ నమోదు, ధ్రువీకరణ కార్యాలయాలు పనిచేశాయి. పాతబస్తీలోని చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, మలక్‌పేట, బహదూర్‌పురా, రాజేంద్రనగర్ తదితర శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని ప్రాంతాలు ఈ కార్యాలయం పరిధిలోనే పనిచేశాయి. 2018 నుంచి బల్దియా కార్యాలయాలు ఈ భవనాన్ని ఖాళీ చేసి నర్కిపూల్ బాగ్‌కు మారడంతో అప్పటి నుంచి సర్దార్ మహల్ భవనం ఖాళీగా మారింది.

పాతనగర మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో అధ్యక్షులు ఆరె దత్తు తదితరులు

గౌలిపురా: పాతనగర మున్నూరు కాపు సంఘం కులస్తుల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం గౌలిపురాలోని శివపార్వతీ ఫంక్షన్ మహల్‌లో నిర్వహించారు. ఈ మేరకు కులస్తుల సూచన మేరకు అధ్యక్షుడిగా ఆరె దత్తు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్నూరు కాపు కులస్తులు, సంఘం ప్రతినిధుల మనోభావాలను లెక్క చేయకుండా గత కమిటీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఉపాధ్యక్షులుగా పొన్న శ్రీనివాస్, కె.చంద్రశేఖర్, అశ్విన్‌కుమార్, తాడెం శ్రీనివాస్‌రావు, పి.రామ్మోహన్, కె.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గడ్డి పంచజన్యం, కార్యదర్శులుగా పుప్పాల మధుసూదన్, బొజ్జం సాయికిరణ్, సీహెచ్.జగన్, కోశాధికారిగా పొన్న బాల్‌రాజ్, చీఫ్ అడ్వైజర్‌గా కమతం రమేశ్, అడ్వైజర్‌గా కె.గోవింద్ రాజ్, కె.సురేశ్ బాబు, కె.ఎస్.ఆనంద్ రావు, పొన్న వెంకటరమణ, తాడెం మాణిక్ ప్రభులను ఎన్నుకున్నారు.

ఉగ్రవాదులను ప్రభుత్వం తుద ముట్టించాలి



నిరసన ర్యాలీలో పాల్గొన్న నిర్మల్‌కుమార్ యాదవ్

అఫ్జల్‌గంజ్: ఉగ్రవాదులను తుద ముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. అఫ్జల్‌గంజ్ నుంచి ఆయన ఆధ్వర్యంలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ..పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పి తీరుతామన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ ఉగ్రవాదులకు అడ్డగా మారిందన్నారు.

తెలంగాణ తల్లికి నివాళి



అఫ్జల్‌గంజ్: ధూల్‌పేట రహింపురా వద్ద ఉన్న తెలంగాణ తల్లికి గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు మనోహర్ గైక్వాడ్, శ్రీశైలం, విష్ణుమూర్తి, దినేష్ సింగ్ ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ హయాంలోనే సస్యశ్యామలంగా ఉండేదన్నారు. 25 ఏళ్ల కాలంలో పార్టీ ప్రజా అభ్యున్నతికి ఎంతో కృషి చేసిందన్నారు.

మే 18న గాయత్రీ హిల్స్ కాలనీ ఎన్నికలు



మాట్లాడుతున్న కాలనీ సీనియర్ సభ్యుడు ఇస్మాయిల్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని గాయత్రీ హిల్స్ కాలనీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఎన్నికలు మే 18న నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. గత కమిటీ పదవీ కాలం ఏప్రైల్ నెలతో ముగియడంతో ఆదివారం కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీనియర్ సభ్యుడు ఇస్మాయిల్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ మేరకు నూతన కమిటీ నియామకానికి వచ్చే నెల 11న నామినేషన్లు ఉంటాయని, 13న నామినేషన్ల ఉపసంహరణ, మే 18న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెంబర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా రూ. 1000 ఇచ్చి నమోదు చేసుకున్న ప్రతి ఇంటికి ఓటు హక్కు కల్పిస్తామని తద్వారా సేకరించిన డబ్బును కాలనీ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. సభ్యత్వం తీసుకోవడానికి మే 7 ఆఖరి తేదీగా తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సీనియర్ సభ్యులు రాఘవులు, మల్లేష్, జయప్రసాద్, నారాయణ రావు, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు తెచ్చిన తంటా..

- అప్పు తీసుకుని ఒకరు..
- వసూలు చేసుకునేందుకు మరొకరు
- విధులకు ఎగనామం
- ఊడిన ఇద్దరి కొలువులు

ఫిలింనగర్: అప్పు తెచ్చిన తంటా ఒకే కార్యాలయంలో పనిచేసే ఇద్దరి కొలువులు ఊడేలా చేసింది. అప్పు తీసుకున్న వ్యక్తి ఉద్యోగానికి రాకుండా తప్పించుకు తిరుగుతుండగా, అప్పు ఇచ్చిన వ్యక్తి అతని కోసం వెతుకుతూ ఉద్యోగం కోల్పోయాడు. వివరాల్లోకి వెళితే ఫిలింనగర్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్, రాంనగర్ లక్ష్మీనారాయణకాలనీకి చెందిన ప్రశాంత్ జలసౌధ భవనంలోని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డులో అటెండర్లుగా పనిచేస్తున్నారు. వారు ఇద్దరూ స్నేహితులు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌కు ప్రవీణ్‌కుమార్ రూ.లక్ష అప్పుగా ఇప్పించాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు శ్రీనివాస్ తన కుటుంబం ఇబ్బందుల్లో ఉందని మరో రూ.4 లక్షలు కావాలని ప్రవీణ్‌ను కోరడంతో అతను ఆరు నెలల్లో తిరిగి చెల్లించేలా ప్రామిసరీ నోట్ రాయించుకుని రూ. 4 లక్షలు ఇచ్చాడు. గడువు తీరినా శ్రీనివాస్ బాకీ చెల్లించకపోవడంతో ప్రవీణ్ అతడిపై ఒత్తిడి పెంచాడు. దీంతో శ్రీనివాస్ ఆఫీసుకు రావడమే మానేశాడు. దీంతో ప్రవీణ్ అతడి ఇంటికి వెళ్లి అడగ్గా మరో ఆరు నెలలు సమయం కావాలని కోరాడు. ఆ గడువు పూర్తయినా అతని నుంచి ఎలాంటి స్పందన లేదు. అంతేగాక శ్రీనివాస్ తన మకాం మార్చడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. అతడి కోసం గాలించే క్రమంలో ప్రవీణ్ ఆఫీసుకు వెళ్లకపోవడంతో ఉన్నతాధికారులు అతడిని ఉద్యోగంలోంచి తొలగించారు. దీంతో చేసేదేమీ లేక శ్రీనివాస్‌పై ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుల్సుంపురా పార్కులో స్వచ్ఛ భారత్



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

గోల్కొండ: కుల్సుంపురా పార్కులో ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కుల్సుంపురా పార్కు అసోసియేషన్ సభ్యులతో కలిసి బీజేపీ సీనియర్ నాయకులు దేవర వంశీ పార్కులో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ స్ఫూర్తితో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలోమార్నింగ్ వాకర్స్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

బంజారాహిల్స్: జల్సాలకు అలవాటు పడిన ఓ ఆస్పత్రి ఉద్యోగి ఈజీ మనీ కోసం గంజాయి విక్రేతగా మారి బంజారాహిల్స్ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఉదయ్‌నగర్‌లో నివసించే బిజినమైన రఘు సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కార్డియో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మహారాష్ట్రకు చెందిన షేక్ అంజాద్ అనే గంజాయి స్మగ్లర్‌తో ఏర్పడిన పరిచయం ఆధారంగా గజాయి విక్రయాలకు తెరలేపాడు. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి అంబేద్కర్‌నగర్ సమీపంలోని శ్మశానవాటికలో కిలోన్నర గంజాయి ప్యాకెట్‌తో వచ్చి చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడి చేసి రఘును రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకుని అతడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

బంజారాహిల్స్: శుభ కార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును దోచుకెళ్లిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సయ్యద్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ బషీర్ బిన బిలాల్ ఈ నెల 25న రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యంలో పాల్గొనేందుకు ఆరాంఘర్‌కు వెళ్లాడు. 26న తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు విరగ్గొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ఏడు గ్రాముల బంగారు గొలుసు, ఉంగరం, 50 తులాల వెండి ఆభరణాలు, రూ.65,000 నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

శంషాబాద్: ఏటీఎంలో చోరీకి యత్నించిన సంఘటన చోటు శంషాబాద్ పట్టణంలో చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన ఉన్న సౌండి ఇండియా ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించిన హెల్మెట్ ధరించి వ్యక్తి ముందుగా అక్కడ సీసీ కెమెరాల వైర్లు తొలగించాడు. మరికొన్ని వైర్లు కత్తిరిస్తుండగా అలారం మోగడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంప్రదాయ కళలను కాపాడుకోవాలి



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: శ్రీ నటరాజ కళా క్షేత్రం 25వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు రాకేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సంప్రదాయ కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. 25 ఏళ్లుగా నటరాజ కళాక్షేత్రం కళలు, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాగలాండ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాసులు, నాట్య గురువు వసుమతి, పరిశోధకులు మదన్‌గుప్తా, సంస్థ అధ్యక్షురాలు పూర్ణిమా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి



బల్దియా కమిషనర్ ఇలంబర్తితో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన బల్దియా కమిషనర్ ఇలంబర్తిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో దోమల స్వైర విహారాన్ని కమిషనర్‌కు వివరించారు. లంగర్‌హౌస్ హెచ్ఎండీఏ చెరువు, బుల్కాపూర్ నాలా, గోల్కొండ కోట కందకాలు, శాతం చెరువుతో పాటు కటోరాహౌజ్ దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయన్నారు. డ్రోన్ ద్వారా గత వారం ప్రారంభమైన దోమల మందు వేసే పనులు మధ్యలోనే ఆగిపోయాయని తెలిపారు. ముందుగా గోల్కొండ కోట కందకాలు, చెరువులలో వ్యర్థాలు, పిచ్చి మొక్కలు తొలగించాలని ఆయన కోరారు. మరో వైపు పారిశుద్ధ్య పనులు సవ్యంగా జరగకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. ఫ్లోర్ మిల్, ఎండిలైన్స్, శాతంచెరువు, మోతీదర్వాజా, లంగర్‌హౌస్, కార్వాన్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయన్నారు. ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. త్వరలోనే తాను దోమల నివారణకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తానని ఈ సందర్భంగా కమిషనర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం



గోల్కొండ: ప్రజల దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయని ఇది అభినందనీయమని గుడిమల్కాపూర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వేణుగౌడ్ అన్నారు. కుంబాజీగూడలోని వీరభద్రస్వామి ఆలయం వద్ద జలనిధి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీరభద్రస్వామి ఆలయ ట్రస్ట్ చైర్మన్ క్రాంతిసాగర్, కన్నాలాల్, బాలాంజనేయ భక్త సమాజం చైర్మన్ ఆర్.గోపిసాగర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న నర్సింగ్ రావు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడలోని అరుంధతి కాలనీ బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణం కోసం స్థానిక భక్తుడు కోయడ నర్సింగ్ రావు, అతని కుమారులు విరాళం ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇప్పటికే మొదటి దఫాగా రూ.50 వేలు ఇచ్చిన నర్సింగ్ రావు, తాజాగా ఆదివారం మరో రూ.15,101లను కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అరుంధతి కాలనీ కమిటీ అధ్యక్షుడు వై.నందు, కార్యదర్శి రవి, కోశాధికారి నాగరాజు, కేబుల్ రాము, చందూ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



అన్నదాన చేస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్రను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు



మహంకాళి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పూజారి సురేష్‌చారి

గౌలిపురా: అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంగం లాల్‌దర్వాజా గౌలిపురా, వాసవి అన్నపూర్ణ సేవా సంస్థ ప్రతి నెల నిర్వహించే కార్యక్రమంలో ఆదివారం గౌలిపురా బతుకమ్మ బావి వద్ద ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఛత్రినాక చౌరస్తాలో ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి కటకం శివ కుమార్ గుప్తా, కోశాధికారి లింగా ప్రకాశ్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా నూతన అధ్యక్షులు శ్రీరాం కోటయ్య గుప్తా, ఐపీపీ శ్రీధర మల్లికార్జున్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గుబ్బ శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి పడకంటి వెంకటేశం గుప్తా పాల్గొన్నారు.

గోల్కొండలో..

గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరి ఉన్న మహంకాళి అమ్మవారికి ఆదివారం ఆలయ పూజారి బి.సురేష్‌చారి అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, పర్యాటకులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

హీమోఫీలియాపై అవగాహన అవసరం



హీమోఫీలియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పంజగుట్ట: ప్రపంచంలో అన్ని దేశాలతో పోలిస్తే భారతదేశంలోనే హీమోఫీలియా బాధితులు ఎక్కువగా ఉన్నారని ప్రముఖ హెమటాలజీ వైద్య నిపుణులు విక్రమ్ కుమార్ అన్నారు. బాధితుల సంఖ్య నానాటికీ పెరగడం బాధాకరమన్నారు. ఆదివారం రాజ్‌భవన్ రోడ్డులోని అశ్విన్ ఆసుపత్రిలో హీమోఫిలియా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షులు చంద్రశేఖర్ రావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వ్యాధి బాధితులకు ఉచిత సేవలందించేందుకు ఏర్పాటు చేసిన హీమోఫిలియా ట్రీట్‌మెంట్ సెంటర్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా వ్యాధిగ్రస్తులకు తపాడియా డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులు ఉచిత నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విక్రమ్ కుమార్, చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వస్తున్నప్పటికీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగడం బాధాకరమన్నారు. పూర్తిగా వ్యాధి నయం కాకున్నా ఉపశమనం కలిగేందుకు ఆధునిక వైద్య చికిత్స, మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. శరీరంలో అంతర్గత రక్తస్రావం జరిగినప్పుడు ఫ్యాక్టర్ ఇంజెక్షన్‌తో పాటు రక్తస్రావం అవుతున్న చోట ఐస్ పెడుతుండాలని సూచించారు. ఫిజియో థెరపీ తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సీతాదేవి, రమణి, రాధేశ్యామ్, హేమంత్ కుమార్, వంశీ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ బీజేపీ కార్యాలయంలో 'మన్‌కీ బాత్'



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల, చంద్రశేఖర్ తివారీ

బంజారాహిల్స్: ప్రధాని మంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని సాగర్ సొసైటీలోని ఖైరతాబాద్ నియోజక వర్గం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ చెప్పిన పలు విషయాలపై వారు కార్యకర్తలు, నేతలతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు గౌతంరావు, మేచినేని శ్రీనివాస్, బోజిరెడ్డి పల్లె వీణారెడ్డి, మద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.